సాక్షి శ్రీకాకుళం

శుక్రవారం, 13, జనవరి, 2023



అధిక ధరలకు అమ్మితే చర్యలు

అధిక ధరలకు స్టాంపులు అమ్మకూడదని విజిలెన్స్ సీఐ అప్పలనాయుడు అన్నారు. స్టాంప్ వెండర్ దుకాణాలు పరిశీలించారు. - IIలో



అలరించిన సంబరాలు

యువజన సంబరాలు అలరించాయి. టెక్కలిలో ప్రజా చైతన్య కళా సమితి ఆధ్వర్యంలో నిర్వహించారు. - IIలో

భోగి రోజున 5కే రన్

కాశీబుగ్గ: రంగోయి రైల్వేగేటు వద్ద 14వ తేదీన సంక్రాంతి సందర్భంగా 5కే రన్ నిర్వహిస్తున్నట్లు ఉద్దాన ప్రాంత విద్యాభివృద్ధి వేదిక సభ్యులు ప్రకటనలో తెలిపారు. ఉదయం 6 గంటలకు గేటు నుంచి యూవీవీ గ్రంథాలయం వరకు పరుగు ఉంటుందని, ఆసక్తి గల వారు 8247253407 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

న్యూస్‌రీల్

23 నుంచి లాంగ్వేజ్ పండిట్ కోర్సుల పరీక్షలు

శ్రీకాకుళం న్యూకాలనీ: లాంగ్వేజ్ పండిట్ టీచర్ (ఎల్‌పీటీ) కోర్సులు చదువుతున్న విద్యార్థుల థియరీ పరీక్షలు ఈనెల 23వ తేదీ నుంచి జరగనున్నాయని డీఈఓ గార పగడాలమ్మ తెలిపారు. ఈ మేరకు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. 2019–20, 2020–21 మేనేజ్‌మెంట్ బ్యాచ్‌ల విద్యార్థులకు ఈనెల 23 నుంచి 28వ తేదీ వరకు ఈ పరీక్షలు జరుగుతాయని చెప్పారు. ప్రతి రోజు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్ష జరుగుతుందని, పరీక్షకు గంట ముందు విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని డీఈఓ సూచించారు. అన్ని కాలేజీల యాజమాన్యాలు, ప్రిన్సిపాళ్లు విషయాన్ని గుర్తించి విద్యార్థులు సకాలంలో పరీక్షలకు హాజరయ్యే విధంగా చొరవ తీసుకోవాలని ఆమె సూచించారు. మరిన్ని వివరాలకు 95056 78655 నంబర్‌ను సంప్రదించవచ్చు.

విధుల్లో చేరిన ప్రత్యేక ఉప కలెక్టర్



విధుల్లోకి చేరిన ఎస్‌డీసీ మురళీకృష్ణ

శ్రీకాకుళం పాతబస్టాండ్: కొవ్వాడ భూ సేకరణ యూనిట్‌కు సంబంధించి ప్రత్యేక ఉప కలెక్టర్ (భూ సేకరణాధికారి)గా పంచిరెడ్డి మురళీకృష్ణ గురువారం విధుల్లోకి చేరారు. ఈ మేరకు గురువారం సాయంత్రం కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. ఈయన ఇప్పటి వరకు వెలగపూడిలోని సచివాలయం విభాగాధిపతిగా పనిచేశారు. పదోన్నతిపై బదిలీ మీద కొవ్వాడ ఎస్‌డీసీగా ప్రభుత్వం నియమించింది. విధుల్లో చేరకు ముందు ఆయన కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్, జేసీ ఎం.నవీన్, డీఆర్‌ఓ ఎం.రాజేశ్వరిలను మర్యాదపూర్వకంగా కలిశారు. కొవ్వాడ భూ సేకరణ, నిర్వాసితుల సమస్యల పరిష్కారం, పునరావాసం వంటి పనులు చురుగ్గా చేపడతానని ఆయన తెలిపారు.

శ్రీకూర్మనాథుని సన్నిధిలో కరైకుడి స్వామి



కూర్మనాథుడిని దర్శించుకున్న కరైకుడి స్వామి

గార: ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీ కూర్మంలోని కూర్మనాథుడిని కంచి పీఠాధిపతి కరైకుడి స్వామీజీ గురువారం దర్శించుకున్నారు. మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు సీహెచ్ నరసింహాచార్యులు క్షేత్ర మహత్యాన్ని తెలియజేశారు. కార్యక్రమంలో ఈఓ జి.గురునాథం, పాలక మండలి సభ్యులు పి.వాసుదేవరావు తదితరులు పాల్గొన్నారు.

17న పారా మిలటరీ సైనికుల సమావేశం

నరసన్నపేట: స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో ఈ నెల 17న పారా మిలటరీ, కేంద్ర సాయుధ పోలీసు బలగాలకు చెందిన సభ్యుల సమావేశం నిర్వహిస్తున్నట్లు సంబంధిత అసోసియేషన్ ప్రతినిధులు కోట్ని లక్ష్మణరావు, అట్ల సుమన్, కె.రామారావు, వై.అప్పలనాయుడు తెలిపారు. బీఎస్‌ఎఫ్, సీఐఎస్‌ఎఫ్, సీఆర్‌పీఎఫ్, ఐటీబీపీ, ఎస్‌ఎస్‌బీ, అస్సాం రైఫిల్స్‌కు చెందిన జిల్లా సైనికులు అందరూ ఈ సమావేశంలో పాల్గొనాలని కోరారు. పారామిలటరీ అసోసియేషన్ ఏర్పాటై మూడేళ్లవుతున్న సందర్భంగా సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

రైలు నుంచి జారిపడి ఒడిశా వాసి మృతి

టెక్కలి రూరల్: కోటబొమ్మాళి రైల్వేస్టేషన్‌లో బుధవారం రాత్రి ఒడిశా రాష్ట్రానికి చెందిన ఓ వ్యక్తి రైలు నుంచి జారిపడి మృతి చెందినట్లు పలాస రైల్వే హెడ్‌కానిస్టేబుల్ రమేష్ గురువారం తెలిపారు. ఈ మేరకు ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిశా రాష్ట్రం బాలాషోర్ జిల్లాకు చెందిన బశ్వంత్‌సింగ్ అనే వ్యక్తి కోణార్క్ రైల్‌లో ఒడిశా వైపు వెళ్తుండగా ప్రమాదవశాత్తు జారి పడి మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి వద్ద ఉన్న సెల్‌ఫోన్ ఆధారంగా వివరాలు సేకరించినట్లు తెలిపారు. అనంతరం వారి కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. అనంతరం శవపంచనామా కోసం పలాస రైల్వే ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



పలాస రైల్వేస్టేషన్‌లో..



కాశీబుగ్గలో ఆర్టీసీ ఎక్కేందుకు పోటీ పడుతున్న ప్రయాణికులు



కాశీబుగ్గ బస్టాండ్ వద్ద బస్సుల కోసం ఎదురుచూస్తున్న తల్లిదండ్రులు, పిల్లలు



పల్లె గూటికి పండగొచ్చింది..

పల్లె తల్లి ఒడికి కన్నబిడ్డలు చేరుకుంటున్నారు. వలస వెళ్లిపోయిన వారు సొంతూళ్లకు వస్తుండడంతో ఊళ్లన్నీ పండగ కళ సంతరించుకుంటున్నాయి. సంక్రాంతికి వస్తున్న వారితో పలాస రైల్వే స్టేషన్ రద్దీగా కనిపించింది. ఇచ్ఛాపురంతో పాటు ఇటు కోటబొమ్మాళి వరకు, పర్లాఖిమిడి నుంచి గారబంద పరిసర ఒడిశా ప్రాంతీయులు సైతం ఇక్కడే దిగడంతో రద్దీ కనిపించింది. పలాస ఆర్టీసీ కాంప్లెక్స్ కూడా ప్రయాణికులతో కళకళలాడింది. – కాశీబుగ్గ



తిట్లే.. ఆయన శక్తి

- సభ ఆసాంతం తిట్లు శాపనార్థాలే..
- యువశక్తి సభలో పవన్ ప్రసంగం తీరు
- ఆద్యంతం యువతను రెచ్చగొట్టే వ్యాఖ్యలు



మాట్లాడుతున్న పవన్ కల్యాణ్

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం: జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ యువశక్తి సభ ఆద్యంతం ఆరు తిట్లు–మూడు విమర్శలు అన్నట్టుగానే సాగింది. తిట్టడానికి ఈ యువశక్తి సభ కాదంటూనే సభ చివరికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, మంత్రులు గుడివాడ అమర్‌నాథ్, అంబటి రాంబాబు, రోజా, సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డిను తిడుతూనే ప్రసంగం సాగించారు. నోటికొచ్చినట్టు దూషణ చేశారు. తాను తిట్టొచ్చు.. ఎదుటోళ్లు తిట్టకూడదు.. తాను విమర్శలు చేయవచ్చు.. ప్రత్యర్థులు మాట కూడా ఆడకూడదు... అన్నట్టుగానే మాట్లాడారు. తనను ఎవరైనా ఏమైనా అంటే చెప్పుతో కొట్టండని యువకులను ఉసిగొల్పారు.

లావేరు మండలం తాళ్లపాలెంలో యువశక్తి పేరుతో నిర్వహించిన బహిరంగ సభకు రాష్ట్ర నలుమూలల నుంచి సినిమా అభిమానంతో యువత వచ్చారు. ఉదయం 11గంటలకు సభ ప్రారంభమవుతుందని పిలుపునివ్వడంతో జనం అక్కడికొచ్చేశారు. కానీ సాయంత్రం 5.30 గంటల వరకు పవన్ కల్యాణ్ వేదికపైకి రాలేదు. అంతవరకు తరలివచ్చిన యువత అంతా వేచి చూడక తప్పలేదు. ఇక 100 మంది యువకుల వాయిస్ వింటామని, వారంతా మాట్లాడుతారని చెప్పినా కేవలం 20మందితో మమ అనిపించేశారు. ఆ మాట్లాడిన వారంతా అయా రంగాలపై అవగాహన ఉన్న వారు కాదు. జనసైనికుల మాదిరిగానే మాట్లాడారు. ప్రసంగం ప్రారంభించాక యువశక్తి కార్యక్రమంలో భాగంగా ఏం చెబుతారో అని ఎదురు చూసిన వారికి నిరాశే ఎదురైంది. ముఖ్యమంత్రి, మంత్రులపై చేసిన తిట్లనే వినాల్సి వచ్చింది. సింగిల్ లైన్‌లో ఉత్తరాంధ్ర వెనుకబాటు తనాన్ని తీసేస్తా, వలసలు ఆపుతా, పరిశ్రమలు వచ్చేలా చేస్తా, మత్స్యకారులకు జెట్టీలు నిర్మిస్తా అని చెప్పి మిగతా సమయమంతా అధికార పార్టీ నేతలను తి ట్టడమే పనిగా పెట్టుకున్నారు.

అవసరమైతే గొడవ పడాలంటూ యువతను రెచ్చగొట్టేలా విద్వేషపూరితంగా ప్రసంగాన్ని సాగించారు. తనపై మాట్లాడే వారిపైన దాడులు చేయాలన్నట్లు సంకేతాలిచ్చారు. ఇక జిల్లా మంత్రులు ధర్మాన ప్రసాదరావు, సీదిరి అప్పలరాజులను హేళన చేస్తూ మాట్లాడారు. జిల్లాలో చేస్తున్న అభివృద్ధి పనులను ఎక్కడా ప్రస్తావించలేదు. ఈ జిల్లాకు ఏదైనా జరిగిందంటే అదంతా తన చలవే అన్నట్టుగా ప్రసంగించారు. చివరిగా తనకు జనలొస్తారు గానీ, ఓట్లేయరంటూ తన అభిమానులపై అక్కసును వెళ్లగక్కారు. నమ్మకం లేకనే తాను పొత్తుకు వెళుతున్నానని చెప్పుకొచ్చారు. మీరేమైనా గ్యారంటీ ఇస్తారా? మీ తల్లిదండ్రులతో మాట్లాడి చెప్పండని మా ట్లాడారంటే ఎంత అభద్రతా భావంతో ఉన్నారో స్పష్టంగా కనిపించింది. రానున్న ఎన్నికల్లో టీడీపీతో పొత్తు పెట్టుకుంటున్నానని దానికి జన సైనికులు సిద్ధమవ్వాలనే సంకేతాన్ని చెప్పకనే చెప్పారు. పవన్ ప్రసంగించిన తీరు నచ్చక చాలా మంది ప్రసంగం మధ్యలోనే వెళ్లిపోవడం కనిపించింది.

జెట్టీలు నిర్మిస్తాం..

ఎచ్చెర్ల క్యాంపస్, రణస్థలం, లావేరు, జి.సిగడాం: తాము పొత్తులతో వెళ్లి మిశ్రమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే జిల్లాలో మత్స్యకారుల కోసం జెట్టీలు నిర్మిస్తామని జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ హామీ ఇచ్చారు. లావేరు మండలంలోని తాళ్లవలసలో గురువారం యువశక్తి పేరుతో పార్టీ నాయకులు, అభిమానులతో భారీ బహిరంగ సభ నిర్వహించారు. కార్యక్రమంలో పవన్ కల్యాణ్ ప్రసంగం కార్యకర్తలను ఉద్రేకపరిచేలా సాగింది. జిల్లా మంత్రులు ధర్మాన ప్రసాదరావు, సీదిరి అప్పలరాజుపై విమర్శలు చేశారు. తనకు 175 నియోజకవర్గాల్లో సింగిల్‌గా పోటీ చేసే సత్తా లేదని, టీడీపీతో పొత్తు తప్పదని కార్యకర్తలకు నేరుగా చెప్పేశారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఉత్తరాంధ్రలో మత్స్యకారుల వలసల నిర్మూలనకు కృషి చేస్తానన్నారు. జిల్లాకు చెందిన గిడుగు రామ్మూర్తి పంతులు వ్యావహారిక భాషోద్యమం తనకు స్ఫూర్తినిచ్చిందని, వీర గున్నమ్మ పోరాటాన్ని అంతా స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు.

క్రికెటర్లకు ఆర్థిక సాయం

లావేరు, ఎచ్చెర్ల క్యాంపస్, రణస్థలం, జి.సిగడాం, ఎచ్చెర్ల: అంధుల టీ20 క్రికెట్ వరల్డ్ కప్ గెలిచిన టీమిండియా సభ్యులైన విజయనగరానికి చెందిన దుర్గారావు, శ్రీకాకుళానికి చెందిన వెంకటేశ్వరరావు, బొబ్బిలికి చెందిన రవికి జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ రూ.50వేలు ప్రోత్సాహకం అందించారు. విజయనగరం జిల్లా చీపురుపల్లికి చెందిన మొబైల్ గ్రంథాలయాన్ని నడుపుతున్న రెడ్డి రమణను ప్రోత్సహిస్తూ రూ.2లక్షలు, మత్స్యకార వికాస్ విభాగానికి రూ. 2 లక్షలు అందించారు. అలాగే జనసేన సభలకు వచ్చి ప్రమాదాల్లో మృతి చెందిన వారి కుటుంబాలకు పార్టీ తరఫున రూ.5 లక్షలు ఆర్థిక సాయం అందజేశారు. మృతిచెందిన నగేష్ అనే విద్యార్థి కుటుంబానికి అండగా ఉంటానన్నారు.

పవన్ సభలో కొట్లాట



రణస్థలం: పవన్ కల్యాణ్ యువశక్తి సభ వద్ద కొట్లాట చోటు చేసుకుంది. జేఆర్ పురం పంచాయతీలో గల సీతంవలస గ్రామానికి చెందిన పలువురికి, అలాగే జనసేన వలంటీర్లకు తీవ్ర గాయాలయ్యాయి. జనసేన వలంటీర్లు ఆస్పత్రికి వెళ్లి క్షతగాత్రులను కారులో బలవంతంగా ఎక్కించుకుని కొట్టుకుంటూ లావేరు పోలీసులకు అప్పగించారు. ఈ కొట్లాటపై లావేరు ఎస్‌ఐ కోటేశ్వరావు కేసు నమోదు చేశారు.

గుండెపోటుతో వృద్ధుడు మృతి



రణస్థలం: జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ యువశక్తి బహిరంగ సభకు హాజరైన విశాఖపట్నం తూర్పు నియోజకవర్గానికి చెందిన వానపల్లి రంగారావు(68) గురువారం గుండెపోటుతో మృతి చెందారు. ఉదయం 10 గంటల సమయంలో వీఐపీ గ్యాలరీ సమీపంలో నడుస్తూ ఒక్కసారిగా కుప్పకూలిపోయారు. వెంటనే ఆయనను విశాఖపట్నంకు అంబులెన్స్‌లో ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే ఆయన గుండెపోటుతో చనిపోయినట్లు వైద్యులు తెలిపారు. దీనిపై వివరాలు తెలియాల్సి ఉందని లావేరు పోలీసులు చెప్పారు.

అక్రమ మద్యం అదుపుపై ప్రత్యేక దృష్టి

- విశాఖ రేంజ్ డీఐజీ హరికృష్ణ



రికార్డులు పరిశీలిస్తున్న విశాఖ రేంజ్ డీఐజీ హరికృష్ణ

కవిటి: విశాఖపట్నం రేంజ్ పరిధిలో తీర ప్రాంతాలు, పొరుగు రాష్ట్రాల నుంచి అక్రమ మద్యం రవాణా నిరోధానికి అదనపు బలగాలను ఏర్పాటు చేసి ప్రత్యేక దృష్టి సారించినట్టు విశాఖ రేంజ్ డీఐజీ ఎస్.హరికృష్ణ తెలిపారు. వార్షిక తనిఖీల్లో భాగంగా కవిటి పోలీస్ స్టేషన్‌ను ఆయన తనిఖీ చేసి వివిధ రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం తదితర జిల్లాల పరిధిలో జాతీయ రహదారులపై ప్రమాదాల నివారణకు చేసిన ఏర్పాట్లు సత్ఫలితాలు ఇచ్చాయని తెలిపారు. జిల్లాలో ఎక్కువ సంఖ్యలో రోడ్డు ప్రమాదాలు జరగడం ఆందోళన కలిగిస్తోందన్నారు. దీనిపై కూడా ప్రత్యేకంగా దృష్టి సారించామని తెలిపారు. సచివాలయాల్లో మహిళా పోలీసు అసిస్టెంట్ల నియామకాలు పోలీసింగ్ వ్యవస్థ బలోపేతానికి దోహదపడ్డాయని తెలిపారు. అటవీ ప్రాంతంలో గంజాయి అక్రమ రవాణాకు తీసుకున్న ప్రత్యేక చర్యలు సానుకూల ఫలితాలిచ్చాయని పేర్కొన్నారు. ఈ మేరకు అటవీ ప్రాంతాల్లో ఈ ఏడాది 7,328 ఎకరాల్లో గంజాయి సాగును అరికట్టాలనే లక్ష్యంతో అక్కడ గిరిజన రైతులకు కాఫీ, వరి, రాజ్మా వంటి పంటల సాగు విత్తనాలు అందించామని చెప్పారు. ఆయనతో కాశీబుగ్గ డీఎస్పీ ఎం.శివరామిరెడ్డి, ఇచ్ఛాపురం సీఐ ఆర్‌ఈసీహెచ్ ప్రసాద్, కవిటి ఎస్‌ఐ కె.రాము ఉన్నారు.

గణతంత్ర వేడుకల నిర్వహణపై సమీక్ష

- కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్



మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: గణతంత్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ అధికారులను ఆదేశించారు. రిపబ్లిక్ డే వేడుకల ఏర్పాట్లపై గురువారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో అన్ని శాఖల అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. శ్రీకాకుళంలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల మైదానంలో గణతంత్ర దినోత్సవం నిర్వహిస్తామని తెలిపారు. ఈ వేడుకలకు మౌలిక వసతుల ఏర్పాట్లపై ఆయా శాఖల అధికారులకు కలెక్టర్ సూచనలు ఇచ్చారు. స్వాతంత్ర్య సమరయోధులను ఆహ్వానించాలని డీఆర్‌ఓకు తెలిపారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, కళాశాలల్లో జాతీయ జెండాను ఆవిష్కరించాలన్నారు. సాయంత్రం బాపూజీ కళామందిర్‌లో సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ మాట్లాడుతూ శకటాల ఏర్పాటు కొత్తగా ఉండాలన్నారు. రిపబ్లిక్ డే వేడుకలకు ఉత్తమ ఉద్యోగులకు అందించే ప్రశంసా పత్రాలకు సంబంధించి జాబితాను 18లోగా అందించాలని కలెక్టర్ సూచించారు. ఉద్యోగుల పేర్లతోపాటు వారు ఏ విధంగా ప్రశంసా పత్రానికి అర్హులో తెలియజేస్తూ వివరణ విధిగా ఉండలన్నారు.

ఉత్తరాంధ్ర స్థాయి క్విజ్ పోటీల విజేత లండారిపుట్టుగ



విజేత జట్టుకు ట్రోఫీ అందిస్తున్న దృశ్యం

కంచిలి: మండలంలోని పెద్దకొజ్జిరియా గ్రామంలో స్వామి వివేకానంద జయంతి సందర్భంగా గురువారం నిర్వహించిన ఉత్తరాంధ్రస్థాయి క్విజ్ పోటీల్లో లండారిపుట్టుగ జట్టు విజేతగా నిలిచి రూ.8,116 బహుమతి, షీల్డ్ అందుకుంది. లోహరిబంద, భైరిపురం జట్లు తర్వాత స్థానాల్లో నిలిచి వరుసగా రూ.5,116లు, రూ.3,116 నగదు బహుమతులు, షీల్డులు అందుకున్నాయి. సోంపేటకు చెందిన సంస్కారభారతి విద్యాసంస్థల సౌజన్యంతో సమకూర్చిన బహుమతులను సోంపేట ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాస్ చేతులమీదుగా అందజేశారు. కార్యక్రమంలో జాడుపూడి ఎంపీటీసీ సభ్యురాలు జామి జయ తదితరులు పాల్గొన్నారు.

వివేకానందుడి మాట.. మన బాట



స్వామీ వివేకానంద విగ్రహానికి పూలమాల వేస్తున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్


- కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్

శ్రీకాకుళం అర్బన్: స్వామీ వివేకానందుడు చెప్పిన మాట, ఆయన నడిచిన బాట మనందరికీ ఆదర్శమని, ముఖ్యంగా యువత ఆ దిశగా నడవాలని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ యువతకు పిలుపునిచ్చారు. స్వామి వివేకానంద 160వ జయంతి సందర్భంగా గురువారం స్థానిక సూర్యమహల్ కూడలి వద్ద గల వివేకానంద విగ్రహానికి కలెక్టర్ పూలమాలలను వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అతి చిన్న వయసులో పెద్ద సందేశాన్ని మనకు అందించిన మహోన్నత వ్యక్తి స్వామి వివేకానంద అని కొనియాడారు. దేశం కోసం యువత ఎలా కష్టపడాలన్న సందేశాన్ని మనకు అందించారని అన్నారు. ఆయన మాటలు మనందరికీ స్ఫూర్తిగా ఉంటాయని, ఆ దిశగా యువత ముందుకుసాగాలని కలెక్టర్ పిలుపునిచ్చారు.

కార్యక్రమంలో స్వామి వివేకానంద సేవా సమితి ప్రతినిధులు డాక్టర్ జామి భీమశంకరరావు, వీజీకె మూర్తి, మందపల్లి రామకృష్ణ, సురంగి మోహనరావు, పి.జగన్మోహనరావు, విద్యార్థులు ఉన్నారు.

విజిట్స్.. విజిల్స్!

- విజయవంతంగా ఫ్యామిలీ డాక్టర్ విధానం
- గ్రామీణుల చెంతకు మెరుగైన వైద్యం
- జిల్లాలో అన్ని పీహెచ్‌సీల పరిధిలోనూ చురుగ్గా విజిట్స్





అరసవల్లి: ఫ్యామిలీ డాక్టర్ విధానం జిల్లాలో చురుగ్గా అమలవుతోంది. అన్ని పీహెచ్‌సీల పరిధిలోనూ చురుగ్గా విజిట్లు జరుగుతున్నాయి. గత ఏడాది అక్టోబర్ నుంచి ఈ ఫ్యామిలీ డాక్టర్ విధానం అమల్లో ఉన్న నేపథ్యంలో తొలుత ట్రయల్ రన్‌గా చేస్తున్న సేవలు సత్ఫలితాలు ఇస్తుండడంతో జిల్లా వ్యాప్తంగా ఈ విధానం పూర్తి స్థాయి సేవలందిస్తోంది. ఇటీవల రాష్ట్ర వైద్యరోగ్య శాఖా మంత్రి విడదల రజిని ఉద్దానం పర్యటనలో భాగంగా ఫ్యామిలీ ఫిజీషియన్ విధానంపై ఆరా తీసి సంతృప్తి వ్యక్తం చేశారు. దీంతో జిల్లాలో వైద్యారోగ్య శాఖ మరింత ఉత్సాహంగా ఈ విధానంలో అడుగులు వేస్తోంది.

జిల్లాలో 30 మండలాల్లో ఉన్న 66 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల (పీహెచ్‌సీ) పరిధిలోని 591 విలేజ్ హెల్త్ క్లినిక్స్ పరిధిలో ప్రస్తుతానికి ఈ విధానం కొనసాగుతుంది. షెడ్యూల్స్ ప్రకారం డాక్టర్లు వరుసగా విజిట్స్ చేస్తున్నారు. ముందుగా ఓపీని తీసుకుని తదనంతరం గ్రామాల్లో బెడ్‌కే పరిమితమైన రోగుల వివరాలు తెలుసుకుని, వారి ఇళ్లకు వెళ్లి వైద్య సలహాలు, ఇతరత్రా చికిత్సలను వైద్యులు అందిస్తున్నారు.

గతంలో కంటే కొత్త నిబంధనల ప్రకారం వైద్యుల విజిట్స్ సంఖ్యలో పెరుగుదల కనిపించింది. అలాగే ఇటీవల ప్రతిభ కనబర్చిన వైద్యులను గుర్తించి జిల్లా కలెక్టర్ ద్వారా ప్రతిభా పురస్కారాలు అందజేశారు.

“అద్భుతంగా సేవలందుతున్నాయి...



జిల్లాలో ఫ్యామిలీ డాక్టర్ విధానంలో భాగంగా ఇప్పటివరకు వందలాది గ్రామాల్లో వేలాది మంది రోగులకు అద్భుతంగా సేవలు అందుతున్నాయి. మొత్తం 591 విలేజ్ హెల్త్ క్లినిక్‌ల పరిధిలోని గ్రామాల్లో 104 వాహన సదుపాయమున్న 66 పీహెచ్‌సీల పరిధిలో ప్రతి పీహెచ్‌సీకి ఇద్దరేసి వైద్యులను నియమించాం. వైద్య సిబ్బంది విధులకు తగిన మ్యాపింగ్‌ను ఎప్పటికప్పుడు షెడ్యూల్ ప్రకటిస్తున్నాం. ఇలాంటి మంచి విధానంతో గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన ఆరోగ్య పరిస్థితులు కనిపించనున్నాయి.

– డాక్టర్ బి.మీనాక్షి, జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి



సింగుపురం పీహెచ్‌సీ పరిధిలో విజిట్ చేస్తున్న వైద్యుడు

క్లుప్తంగా

ఉద్యోగాల పేరుతో మోసం

పొందూరు : ఉద్యోగం పేరుతో మోసం చేసి నగదు తీసుకుని తిరిగి ఇవ్వ లేదని లక్ష్మీపేట గ్రామానికి చెందిన కోవెల నాగరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ ఎస్.లక్ష్మణరావు తెలిపారు. కిచెన్ గార్డెన్ ఉద్యోగం పేరుతో గవర్రాజు తన వద్ద నగదు తీసుకున్నారని నాగరాజు ఈ నెల 4న పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు 420, 468 సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఆర్ఆర్ఆర్ బంగారం



ఆర్ఆర్ఆర్ బంగారు నమూనా

కాశీబుగ్గ: ఆర్ఆర్ఆర్ సినిమాలోని నాటునాటు పాటకు గోల్డెన్ గ్లోబ్ అవార్డు వచ్చిన సందర్భంగా ఆ సినిమా పేరున ఓ కళాకారుడు బంగారు నమూనా తయారు చేశారు. శ్రీకాకుళంలోని కాశీబుగ్గకు చెందిన సూక్ష్మ కళాకారుడు కొత్తపల్లి చిన్నాచారి 0.20 మిల్లీ గ్రాముల బరువుతో బఠానీ గింజసైజులో తయారు చేసిన నమూనా దర్శకులు రాజమౌళికి అందజేస్తానని చెప్పారు.

మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీల్లో సిక్కోలు హవా


పతకాలు సాధించిన సిక్కోలు మాస్టర్స్ అథ్లెటిక్స్ క్రీడాకారులు వీరే

శ్రీకాకుళం న్యూకాలనీ: రాష్ట్రస్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో సిక్కోలు క్రీడాకారులు పూర్తి హవా కనబర్చారు. ఇటీవల గుంటూరు వేదికగా జరిగిన ఈ పోటీల్లో 18 మంది మాస్టర్ అథ్లెటిక్స్ ప్రాతినిధ్యం వహించగా 30 పతకాలు సాధించి శభాష్ అనిపించారు. ఇందులో 13 బంగారు, ఏడు రజత, మరో పది కాంస్య పతకాలు ఉండటం విశేషం. 70 ఏళ్ల పురుషుల విభాగంలో జి.జగన్నాథరావు, పి.మోహనరావు, 65 ఏళ్ల విభాగంలో జె.మధుసూదనరావు, 55 ఏళ్ల విభాగంలో జి.అర్జున్‌రావురెడ్డి, 50 ఏళ్ల విభాగంలో టి.గంగాధర్‌రావు, జె.వి.ఎస్.జగన్నాథం, సీహెచ్.లక్ష్మణరావు, సీహెచ్.గణేశ్వర్, వై.కరుణ్‌కుమార్, మహిళల 70 ఏళ్ల విభాగంలో ఎం.డి.కళావతి, 50 ఏళ్ల విభాగంలో ఎం.స్వీటీ, 45 ఏళ్ల విభాగంలో ఎస్.రమణాదేవి, జి.హైమావతి ఉన్నారు. పతకాలు సాధించిన క్రీడాకారులంతా హర్యానాలో ఫిబ్రవరి 19, 20 తేదీల్లో జరిగే జాతీయస్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో ప్రాతినిధ్యం వహిస్తారని శ్రీకాకుళం జిల్లా మాస్టర్ అథ్లెటిక్స్ సంఘం చైర్మన్ ఎమ్మెస్సార్ కృష్ణమూర్తి, అధ్యక్షుడు ఎండీ ఖాసీంఖాన్, కార్యదర్శి జి.అర్జున్‌రావురెడ్డి తెలిపారు.

దిమ్మిడిజోల పంచాయతీలో అవినీతిపై ఫిర్యాదు


ఎంపీడీఓకు ఫిర్యాదు చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

నందిగాం: మండలంలోని దిమ్మిడిజోల పంచాయతీలో జరుగుతున్న అవినీతిపై దర్యాప్తు చేయాలని వైఎస్సార్ సీపీ నాయకులు గురువారం ఎంపీడీఓ హెచ్.వి.రమణమూర్తికి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దిమ్మిడిజోల సర్పంచ్ సలాన దేవమ్మ స్థానికంగా ఉండకుండా హైదరాబాద్‌లో నివాసముంటున్నారని, బినామీగా ఉన్న సలాన కృష్ణారావు పంచాయతీ నిధులను పనులు చేయకుండానే డ్రా చేసుకుంటున్నారని ఆరోపించారు. కనీసం కాలువలు కూడా శుభ్రం చేయించకుండా తప్పుడు బిల్లులతో దోచేస్తున్నారని, గ్రామసభలు నిర్వహించకుండా తప్పుడు సంతకాలతో సుమారు రూ.20లక్షల అవినీతికి పాల్పడ్డారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ప్రస్తుతం బినామీగా ఉన్న కృష్ణారావు 2014–19 వరకు సర్పంచ్‌గా ఉంటూ నాటి మంత్రి అచ్చెన్నాయుడు అండదండలతో లక్షలాది రూపాయలు దుర్వినియోగం చేశారని ఆరోపించారు. పంచాయతీలో జరిగిన అవినీతిపై సమగ్ర దర్యాప్తు చేపట్టాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో వైస్ ఎంపీపీ రేగల లక్ష్మీకాంతం, కూర్మారావు, మాజీ సర్పంచ్ కొల్లి శ్రీరాములు, సలాన ఈశ్వరరావు, కొల్లి బాలకృష్ణ, లచ్చన్న తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగుల సంఘ జిల్లా అధ్యక్షునిగా జానకిరామ్


కొత్త కార్యవర్గంతో జిల్లా ప్రభుత్వ ఉద్యోగుల సంఘ నేతలు

అరసవల్లి: జిల్లా గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సంఘ అడహక్ కమిటీ అధ్యక్షునిగా ధవళ జానకిరామ్, ప్రధాన కార్యదర్శిగా బుక్క గణపతిరావులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు జెడ్పీ అతిథి గృహం వద్ద జిల్లా ప్రభుత్వ ఉద్యోగుల సంఘ ప్రతినిధుల ఆధ్వర్యంలో గురువారం జరిగిన ఎన్నికల్లో కొత్త కార్యవర్గాన్ని ప్రకటించారు. వర్కింగ్ కమిటీ అధ్యక్షునిగా డి.దుర్గాప్రసాద్, ఉపాధ్యక్షులుగా యు.జయకృష్ణ, పి.వెంకట్, కనక సుందరరాజా, కోశాధికారిగా పి.యశ్వంత్‌తో పాటు మొత్తం 21 మందిని కొత్త కార్యవర్గంగా ప్రకటించారు. కార్యక్రమంలో జిల్లా ప్రభుత్వ ఉద్యోగుల సంఘ జిల్లా అధ్యక్ష, ఉపాధ్యక్షులు ఐ.తిరుపతిరావు, మాసపు సంతోష్‌కుమార్, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు కిల్లారి నారాయణరావు, జెడ్పీ యూనిట్ అధ్యక్షురాలు పి.జయమ్మ, రాష్ట్ర గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సంఘ కార్యదర్శి కూన వెంకట సత్యనారాయణ, ఏపీజీఈఏ రాష్ట్ర కార్యదర్శి గుంటు తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

అధిక ధరలకు స్టాంపు పేపర్లు అమ్మితే చర్యలు


స్టాంప్‌వెండర్ దుకాణంలో తనిఖీ చేస్తున్న విజిలెన్స్ అధికారులు

శ్రీకాకుళం క్రైమ్ : అధిక ధరలకు స్టాంపు పేపర్లు అమ్మితే చర్యలు తప్పవని శ్రీకాకుళం డివిజన్ విజిలెన్స్ సీఐ అప్పలనాయుడు హెచ్చరించారు. రాష్ట్ర వ్యాప్తంగా స్టాంపు పేపర్ల అమ్మకందార్లపై విజిలెన్స్ శాఖ తనిఖీలు చేస్తున్న నేపథ్యంలో ప్రాంతీయ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్సుమెంట్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ (జేడీ) ఎ.సురేష్‌బాబు ఆదేశాల మేరకు గురువారం శ్రీకాకుళం నగరంలోని లైసెన్స్‌డ్ స్టాంప్ వెండర్ దుకాణాలను తనిఖీ చేశారు. కొందరు నిర్దేశిత ముఖ విలువ కన్నా అధిక ధరలకు స్టాంపు పేపర్లు విక్రయిస్తున్నట్లు గుర్తించారు. యూనిట్ పరిధిలో (శ్రీకాకుళం, మన్యం, విజయనగరం జిల్లాల్లో) 11 కేసులు నమోదు కాగా ఒక్క శ్రీకాకుళంలోనే నాలుగు కేసులు నమోదయ్యాయన్నారు. వీరికి నోటీసులిచ్చి విచారణ జరుపుతామన్నారు. తనిఖీల్లో సీఐతో పాటు ఎస్ఐ అశోక్, ఏఈ గణేష్ పాల్గొన్నారు.

వైభవంగా గోదా రంగనాథుల ఊరేగింపు


ఊరేగింపు నిర్వహిస్తున్న అర్చకులు

మందస: మందసలోని వాసుదేవ పెరుమాళ్ స్వామి సన్నిధిలో ధనుర్మాస ఉత్సవాలు కొనసాగుతున్నాయి. సంక్రాంతి సమీపిస్తుండటంతో ఆలయలంలో ప్రత్యేక పూజలు చేస్తున్నారు. గురువారం గోదాదేవి, రంగనాథులను ఊరేగించారు. ప్రధాన అర్చకులు గోపినంబాళ్ల దాసుకూర్మాచార్యులు ఆధ్వర్యంలో ధనుర్మాస విశిష్టతను వివరించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ నెల 14న గోదాదేవి, రంగనాథుల కల్యాణం నిర్వహించనున్నట్లు వేదపండితులు తెలిపారు. కార్యక్రమంలో సచ్చిదానందపాఢి, అనిల్‌స్వామి, గణశ్యాం, ఆండాళ్లగోష్టి తదితరులు పాల్గొన్నారు.

ఫిబ్రవరి నాటికి రీసర్వే పూర్తి కావాలి


వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జేసీ, డీఆర్వో

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలో చేపడుతున్న రీసర్వే ఫిబ్రవరి నాటికి పూర్తికావాలని భూ పరిపాలన ప్రధాన కమిషనర్ జి.సాయిప్రసాద్ కలెక్టర్లను ఆదేశించారు. రీసర్వేపై గురువారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొదటి విడతలో 323 గ్రామాల్లో రీసర్వే పూర్తిచేయాలన్నారు. జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ మాట్లాడుతూ ఇప్పటివరకు 36 గ్రామాల్లో రీసర్వే పూర్తయిందని, మరో 206 గ్రామాల్లో డ్రోన్ సర్వే కూడా చేపట్టామని వివరించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.రాజేశ్వరి, భూసర్వే, రికార్డుల శాఖ సహాయ సంచాలకులు కె.ప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు.

వంతెనపై రక్షణ గోడను ఢీకొని వ్యక్తి మృతి


మొయ్యి శ్రీనివాసరావు (ఫైల్)

భోగాపురం: భోగాపురం జాతీయ రహదారి వంతెనపై రక్షణ గోడను ఢీకొని శ్రీకాకుళం జిల్లా జి సిగడం మండలం బోతులపేట గ్రామానికి చెందిన మొయ్యి శ్రీనివాసరావు(40) గురువారం మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి. గుంటూరులో బ్రహ్మారి కోల్డ్ స్టోరేజ్‌లో ఎలక్ట్రీషియన్‌గా విధులు నిర్వహిస్తూ కుటుంబంతో జీవనం సాగిస్తున్న శ్రీనివాస రావు సంక్రాంతి పండగ కోసం భార్య ముగ్గు రు పిల్లలను బుధవారం రైలులో పంపించి, తాను దిచక్ర వాహనంపై సొంత గ్రామానికి బయలు దేరాడు. ఈ క్రమంలో భోగాపురం జాతీయ రహదా రి వంతెనపైకి చేరుకునే సమయంలో బైక్ అదుపుతప్పి రక్షణ గోడను ఢీకొట్టడంతో శ్రీనివాసరావు తలకు బలమైన గాయమై తీవ్ర రక్తస్రావం కావడంతో అక్కడిక్కడే మృతి చెందాడు. స్థానికుల ద్వారా విషయం తెలుసుకున్న ఎస్సై కృష్ణమూర్తి సంఘట నా స్థలానికి చేరుకుని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని 108 వాహనంలో సుందరపేట సీహెచ్‌సీ కి తరలించారు. మృతుడి మేనల్లుడు చిత్తిరి సత్యనారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

ఆంజనేయ స్వామి ఆలయంలో చోరీ

లావేరు: సుభద్రాపురంలోని అభయాంజనేయ స్వామి ఆలయంలో బుధవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. గుర్తు తెలియని వ్యక్తులు తాళాలు విరగ్గొట్టి ఆలయంలో ఉన్న హుండీని తీసుకెళ్లిపోయారు. లోపలి సామాన్లు చిందరవందరగా పడేశారు. గురువారం ఉదయం అర్చకుడు వచ్చే సరికి ఆలయం తలుపులు తెరిచి ఉండటం, హుండీ కనిపించకపోవడంతో కమిటీ సభ్యులు లావేరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆరు నెలలుగా హుండీ లెక్కింపు చేపట్టలేదని నిర్వాహకులు ముప్పిడి శ్రీనివాసరావు, వీరభద్రరావు తెలిపారు.


హుండీ చోరీకి గురైన ఆలయం

సొంత ఊరికి కొంత మేలు


రెంటికోటలో శ్రమదానం చేస్తున్న వలస ఉద్యోగ, కార్మికులు

కాశీబుగ్గ: ఉద్యోగ, వ్యాపార, ఉపాధి రీత్యా వేర్వేరు ప్రాంతాల్లో స్థిరపడిన వారంతా సంక్రాంతి సెలవులకు వచ్చి సొంతూళ్లపై మమకారం చూపుతున్నారు. పలాస మండలం రెంటికోట గ్రామంలో కోనేరులో పిచ్చిమొక్కలు, గుర్రపుడెక్కలు పేరుకుపోయి స్నానాలకు, మూగ జీవాలకు ఇబ్బందులు కలుగుతుందని గ్రహించిన యువకులు శ్రమదానం చేసి కోనేటిని శుభ్రం చేశారు.

● అపూర్వ సమ్మేళనం


కవిటి మండలం రాజపురం జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో గురువారం 1981–86 మధ్య 6 నుంచి 10వ తరగతి పూర్తిచేసిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశం ఘనంగా నిర్వహించారు. ఆనాడు చదువు చెప్పిన గురువులకు పాదపూజ చేసి సత్కరించారు. – కవిటి

అలరించిన యువజన సంబరాలు


యువజన ఉత్సవాల్లో డూడూ బసవన్నల విన్యాసం


గ్రామీణ మహిళ వేషధారణలో చిన్నారి


గిరిజన సంప్రదాయనృత్యం


తప్పెటగుళ్ల కళాకారుల సందడి

టెక్కలి: స్వామి వివేకానందా జయంతిని పురస్కరించుకుని టెక్కలిలో ప్రజా చైతన్య కళా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన యువజన దినోత్సవ సంబరాలు అలరించాయి. చిన్నారుల వేషధారణలు, డూడూ బసవన్నల విన్యాసాలు, గిరిజన సంప్రదాయ నృత్యాలు, తప్పెటగుళ్లు, కోలాటం ప్రదర్శనలతో సందడి వాతావరణం నెలకొంది. ముందుగా కళా సమితి ప్రతినిధులు స్వామి వివేకానందా చిత్రపటానికి పూలమాలలు వేసి ఘననివాళులర్పించారు. డూడూ బసవన్నల విన్యాసాలు ప్రత్యేక ఆకర్షణగా నిలవగా.. చిన్నారుల వేషధారణలు ఆకట్టుకున్నాయి. అనంతరం వేషధారణలు వేసిన చిన్నారులు, కళాకారులను సత్కరించారు. కార్యక్రమంలో ప్రజా చైతన్య కళా సమితి సభ్యులు పాల్గొన్నారు.

26 నుంచి రాష్ట్రవ్యాప్త పాదయాత్ర


మాట్లాడుతున్న పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ రాకేష్‌రెడ్డి

శ్రీకాకుళం అర్బన్ : రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 26 నుంచి కాంగ్రెస్ పార్టీ పాదయాత్ర అన్ని నియోజకవర్గాల్లో ప్రారంభమవుతుందని పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ పి.రాకేష్ రెడ్డి తెలిపారు. డీసీసీ అధ్యక్షురాలు బొడ్డేపల్లి సత్యవతి ఆధ్వర్యంలో శ్రీకాకుళం ఇందిరా విజ్ఞాన భవన్‌లో గురువారం జిల్లా కాంగ్రెస్ కమిటీ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాకేష్‌రెడ్డి మాట్లాడుతూ జనవరి 26తో రాహుల్ గాంధీ చేస్తున్న పాదయాత్ర మొదటి దశ పూర్తి కావస్తున్న సందర్భంగా దానికి అనుబంధంగా రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో పాదయాత్ర చేయనున్నట్లు తెలిపారు. చేయిచేయి కలుపుదాం–కాంగ్రెస్ పార్టీని బలపరుద్దాం అనే నినాదంతో కాంగ్రెస్ పార్టీని గడపగడపకు తీసుకువెళ్లి ప్రస్తుత ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలు వివరిస్తామన్నారు. సమావేశంలో డీసీసీ అధ్యక్షులు బొడ్డేపల్లి సత్యవతి, పార్టీ నాయకులు దేశేళ్ల గోవింద మల్లిబాబు, అంబటి కృష్ణారావు, రెల్ల సురేష్, బైరి రాజేశ్వరరావు, కె.వి.ఎల్.ఎస్.ఈశ్వరి, అంబటి దాలినాయుడు, దంత త్రినాథరావు తదితరులు పాల్గొన్నారు.

ఉత్కళాంధ్ర కబడ్డీ పోటీల విజేత శ్రీకాకుళం


విజేతలకు ట్రోఫీ అందిస్తున్న ఏపీజీబీఅండ్‌బీసీ చైర్మన్ నర్తు రామారావు తదితరులు

కవిటి: మండలంలోని బొరివంకలో ఉద్దానం యూత్ క్లబ్ ఆఫ్ బొరివంక ఆధ్వర్యంలో నిర్వహించిన ఉత్కళాంధ్ర కబడ్డీ పోటీల్లో శ్రీకాకుళం కేఆర్ స్టేడియం జట్టు విజేతగా నిలిచింది. గురువారం జరిగిన ఫైనల్లో ఉద్దానం, శ్రీకాకుళం కేఆర్ స్టేడియం జట్లు హోరాహోరీగా తలపడటంతో తొలుత టైగా ముగిసింది. దీంతో అంపైర్లు మ్యాచ్‌లో చెరో ఐదు రైడర్లను పెంచగా శ్రీకాకుళం కేఆర్ స్టేడియం జట్టు ప్రథమస్థానం సాధించింది. ఉద్దానం, శ్రీకుమార్ హరిపురం, జిల్లుండ జట్లు తర్వాత స్థానాల్లో నిలిచాయి. విజేతలకు ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ నర్తు రామారావు, వైఎస్సార్ సీపీ నేత కడియాల ప్రకాష్, కంచిలి ఎంపీపీ పైల దేవదాస్ రెడ్డి, కృష్ణారావు, సర్పంచ్ శ్రీరాంప్రసాద్, ఎంపీటీసీ దుద్ది సతీష్, గెస్ట్ అధ్యక్షుడు బల్లెడ శంకరరావు, సంఘం అధ్యక్షుడు లొట్ల దీనబంధు, గౌరవాధ్యక్షుడు దుద్ది విజయగోపాలం బహుమతులు అందించారు.

శాప్‌లీగ్ ఫుట్‌బాల్ ఎంపిక పోటీలు రేపు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాస్థాయి శాప్‌లీగ్ ఫుట్‌బాల్ పురుషుల ఎంపిక పోటీలు శనివారం జరగనున్నాయని డీఎస్‌ఏ చీఫ్ కోచ్ ఎం.మాధురీలత, జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ముని శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా క్రీడాప్రాధికార సంస్థ, జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ పోటీలను శ్రీకాకుళం ఆర్అండ్‌బీ బంగ్లా వద్ద ఉన్న సాయిగిరి ఫుట్‌బాల్ మైదానంలో 14న ఉదయం 8 గంటల నుంచి నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఇక్కడ ఎంపికైన క్రీడాకారులను త్వరలో జరిగే రాష్ట్రపోటీలకు పంపించనున్నట్టు వారు పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 7386956065 (నవీన్) నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	54,930–00
బంగారం(22సి. 10గ్రా.)	50,350–00
వెండి (కిలో)	74,500–00

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)	
విశాఖపట్నం	రూ. 547.00
విజయనగరం	రూ. 551.00
శ్రీకాకుళం	రూ. 551.00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹125	₹205	₹ 225